# మనం

## కృష్ణా / గుంటూరు

ఎన్‌టీఆర్ - బాపట్ల - పల్నాడు

శుక్రవారం | 5 | జూన్ | 2026 | పేజీలు: 10






## అమ్మవారి సేవలో అంతర్ సింగ్ ఆర్య



4 లో








# రాష్ట్రంలో తొలిసారిగా
# కలెక్టర్ వినూత్న చొరవ

పి.మీరాహుస్సేన్ ఖాన్

6 లో

- స్వర్ణ గ్రామం, వార్డు ఉద్యోగులకు సామర్థ్య నిర్మాణం
- ప్రతి గురువారం ప్రత్యేక మాడ్యూల్‌తో సెషన్లు
- ఒత్తిడి రహిత వాతావరణంలో విధుల నిర్వహణకు బాటలు

-విజయవాడ, మనంబ్యూరో

## మోదీ పుష్కర కాలం పాలన... దేశ చరిత్రలో ఒక స్వర్ణాధ్యాయం

6 లో

బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి



## భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలి



7 లో

## హరిత ఆలోచనలతో భావి తరాలను తీర్చిదిద్దాలి

5 లో

పి.మీరాహుస్సేన్ ఖాన్

- చిన్నప్పటి నుంచే పర్యావరణంపై అవగాహన ఉండాలి
- ప్రకృతిపై మమకారంతోనే సమాజంపై బాధ్యత పెరుగుతుంది
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



# జనవాణి కార్యక్రమంలో ప్రజా సమస్యలు



**అర్జీలు స్వీకరించిన సామినేని ఉదయభాను**

**జగ్గయ్యపేట, జూన్ 4 మనం న్యూస్‌:** జనసేన పార్టీ ఆధ్వర్యంలో జరిగిన జనవాణి కార్యక్రమంలో ప్రజా సమస్యలపై అర్జీలను రెండవ రోజైన గురువారం ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు సామినేని ఉదయభాను స్వీకరించారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన 'జనవాణి' కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను పాల్గొని ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల సమస్యలను స్వయంగా విన్న ఆయన, సంబంధిత శాఖల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి త్వరితగతిన పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రజా సమస్యల పరిష్కారమే జనసేన ధ్యేయమని పేర్కొన్న ఆయన, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారు చేపట్టిన 'జనవాణి' కార్యక్రమం ప్రజలకు అండగా నిలుస్తూ వారి సమస్యల పరిష్కారానికి సమర్థ వేదికగా మారిందన్నారు. ప్రజల్లో ఈ కార్యక్రమంపై విశ్వాసం రోజురోజుకూ పెరుగుతోందని సామినేని ఉదయభాను తెలిపారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు స్టాండింగ్ కౌన్సిల్ సింగనూరు శాంతి ప్రసాద్ , విజయవాడ పశ్చిమ నియోజకవర్గం జనసేన పార్టీ వీర మహిళ తిరుపతి అనూష , విజయవాడ పశ్చిమ నియోజకవర్గం జనసేన పార్టీ అజయ్ వర్మ ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై జగ్గయ్యపేట నియోజకవర్గ స్థాయిలో భారీ నిరసనలు




**జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జగ్గయ్యపేట, వత్సవాయి ,పెనుగంచిప్రోలు మండలాలలో నిరసన ప్రదర్శనలు**

**వత్సవాయి మండలం నిరసనలో పాల్గొన్న ఇన్చార్జి తన్నీరు నాగేశ్వరరావు**

**జగ్గయ్యపేట జూన్ 4 మనం న్యూస్‌:** ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానాలను తుంగలో తొక్కి కూటమి ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్చార్జి తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జగ్గయ్యపేట ,వత్సవాయి ,పెనుగంచిప్రోలు మండలాలలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి తన్నీరు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమంలో భాగంగా భారీ నిరసనలను చేపట్టారు. వత్సవాయి మండలంలో జరిగిన నిరసన కార్యక్రమంలో తన్నీరు నాగేశ్వరరావు పాల్గొన్నారు.వత్సవాయి గ్రామంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు సందర్భంగా వత్సవాయి మండల పార్టీ అధ్యక్షుడు గుత్తా శంకర్రావు ఆధ్వర్యంలో గాంధీ బొమ్మ సెంటర్ నుండి తాసిల్దార్ కార్యాలయం వరకు వైఎస్ఆర్ సీపీ నాయకులతో కలిసి నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్ ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానాలను తుంగలో తొక్కి కూటమి ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని ద్రోహం చేశారని విమర్శించారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమ కార్యక్రమాలను నిర్లక్ష్యం చేస్తూ, సామాన్య ప్రజల సమస్యలను గాలికొదిలేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, ప్రస్తుతం వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు.ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు, సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం, పెరుగుతున్న ప్రజా సమస్యలను నిరసిస్తూ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వత్సవాయి తాసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేస్తూ తాసిల్దార్ కార్యాలయంలో వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు యేసుపోగు దేవమణి-శ్రీనివాసరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు మెట్టుకోలు నరేష్, జిల్లా కార్యదర్శి ధరావత్ రుప్లానాయక్, జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు కుక్కల శ్రీధర్, నియోజకవర్గ రైతు, ముస్లిం మైనార్టీ, యువజన విభాగాల అధ్యక్షులు షేక్ రన్ హుస్సేన్, కనగాల రమేష్, నరమనేని వెంకటేష్, మండల, గ్రామ స్థాయి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జగ్గయ్యపేట మండలంలో

జగ్గయ్యపేట వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షులు బూడిద నరసింహారావు ఆధ్వర్యంలో చిల్లకల్లులో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. చిల్లకల్లు ఎస్సీ కాలనీ వైయస్సార్ విగ్రహం నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించి మండల పరిషత్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు.

## పెనుగంచిప్రోలు మండలంలో

పెనుగంచిప్రోలు మండలంలో మండల పార్టీ అధ్యక్షులు పొన్నం కోటేశ్వరరావు ఆధ్వర్యంలో తిరుపతమ్మ దేవస్థానం నుంచి తాసిల్దార్ కార్యాలయం వరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు కార్యకర్తలు, మహిళలు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండ కడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం సంక్షేమ పాలన అందించిందని ప్రతి వర్గానికి మేలు చేసిందని నేతలు గుర్తు చేశారు.

# సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు కండిషనల్ పదోన్నతులు కల్పించాలి

**గాంధీనగర్ జూన్ 4 మనం న్యూస్ :** సుప్రీంకోర్టు తీర్పు మేరకు ప్రస్తుతం సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు కండిషనల్ పదోన్నతులు కల్పించాలని ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు ఎం. కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.ఎం. గిరి ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. వారు మాట్లాడుతూ, దేశంలో నూతన విద్యా విధానం (ఎన్ ఈ వి) అమలులో భాగంగా 2012 సంవత్సరం నుంచి ఉపాధ్యాయ ఉద్యోగాలకు టీచర్ ట్రైనింగ్తో పాటు టెట్ అర్హతను తప్పనిసరి చేశారని తెలిపారు. ఆ నిబంధనల ప్రకారమే 2012 నుంచి ఇప్పటి వరకు ఉపాధ్యాయ నియామకాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.అయితే ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో ప్రస్తుతం సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు రిటైర్మెంట్కు ముందు ఐదు సంవత్సరాల వరకు మినహాయింపు కల్పిస్తూ, మూడు సంవత్సరాలలోగా టెట్ ఉత్తీర్ణత సాధించాలని ఆదేశించిందన్నారు. నిర్దిష్ట గడువులో టెట్ ఉత్తీర్ణత సాధించని పక్షంలో పదోన్నతులకు అర్హత ఉండదని తీర్పులో స్పష్టం చేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు తీర్పు అమల్లో ఉన్నందున, అలాగే టెట్ అర్హత సాధించడానికి మూడు సంవత్సరాల గడువు ఉన్న కారణంగా, పదోన్నతులు ఇచ్చే సమయంలో మూడు సంవత్సరాలలోగా టెట్ ఉత్తీర్ణత సాధించాలి అనే షరతుతో ఉపాధ్యాయులకు కండిషనల్ పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వాన్ని నాయకులు విజ్ఞప్తి చేశారు.

# వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరికలు

**తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్**

**జగ్గయ్యపేట జూన్ 4 మనం న్యూస్‌:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడి ఎనిమిది కుటుంబాల వారు తెలుగుదేశం పార్టీలో చేరారు .వారికి జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ పార్టీ కండవాలని కప్పి సాధారం గా పార్టీలోకి ఆహ్వానించారు వత్సవాయి మండలం, వేములనర్వ గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు తమ కుటుంబ సభ్యులతో కలిసి తెలుగుదేశం పార్టీలో చేరారు. గ్రామానికి చెందిన వాసిరెడ్డి సుధాకర్, వాసిరెడ్డి నిర్మల, పొన్నెకంటి శ్రీను, చల్ల తిరపయ్య, కమతం అగస్టీన్, కమతం రాములు, కమతం సెల్వరాజు, చల్ల గురువులు తదితరులు తమ కుటుంబాలతో కలిసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీలో చేరారు. దాములూరు మేజర్ డీసీ చైర్మన్ చిట్టూరి సుభాష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 20 మంది సభ్యులు ఎమ్మెల్యే మరియు తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీ శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) సమక్షంలో పార్టీలో చేరగా, ఎమ్మెల్యే రాజగోపాల్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం గ్రామానికి చెందిన కమతం మరియమ్మ కి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి మంజూరైన రూ.25,900 చెక్కును ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం ఇటీవలె గ్రామానికి చెందిన రాచబంటి వెంకటేశ్వర్లు కాలు ఫ్రాక్చర్ అయింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) వారి గృహానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై అనేక మంది ప్రజలు స్వచ్ఛందంగా తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారని తెలిపారు. స్త్రీ శక్తి, అన్నదాత సుఖీభవ, దీపం, తల్లికి వందనం వంటి పథకాలు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొస్తున్నాయని పేర్కొన్నారు. అలాగే వేములనర్వ గ్రామంలో గతంలో తెలుగుదేశం పార్టీ హయాంలో సీసీ రోడ్లు, చెరువు అభివృద్ధి, డొంక రోడ్ల నిర్మాణం వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, గ్రామాభివృద్ధికి తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వత్సవాయి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వడ్లమూడి రాంబాబు, గ్రామ పార్టీ అధ్యక్షులు ఇనపనూర్తి వీరయ్య, డబ్బాకుపల్లి సొసైటీ చైర్మన్ పెంటేల శ్రీనివాసరావు, గ్రామ మాజీ నీటి సంఘం అధ్యక్షుడు తాళ్లూరి జనార్ధన్, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.



# మెటా-వి భాగస్వామ్యంతో సురక్షిత డిజిటల్ వెరిఫికేషన్

**గాంధీనగర్ జూన్ 4 మనం న్యూస్:** మెటా ప్లాట్ఫామ్లైన వాట్సాప్, ఫేస్బుక్, ఇన్స్టాగ్రామ్లలో వినియోగదారులకు మరింత సురక్షితమైన, వేగవంతమైన, నిరాటంకమైన వెరిఫికేషన్ సేవలు అందించేందుకు వొడాఫోన్ ఐడియా (వి) సంస్థ మెటాతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యంలో భాగంగా నెట్వర్క్ ఆధారిత అథెంటికేషన్ సొల్యూషన్ 'సైలెంట్ మొబైల్ వెరిఫికేషన్'ను ప్రవేశపెట్టినట్లు సంస్థ ప్రకటించింది. కొత్త యూజర్ రిజిస్ట్రేషన్, మొబైల్ నంబర్ వెరిఫికేషన్, లాగిన్, రీ-లాగిన్, అకౌంట్ రికవరీ, సెక్యూరిటీ చెక్స్ వంటి సందర్భాల్లో ఈ సదుపాయం ఉపయోగపడనుంది.

వినియోగదారులు స్వయంగా వివరాలు నమోదు చేయాల్సిన అవసరం లేకుండా, ఇతర యాప్లకు మారకుండా లేదా ఓటీపీ సందేశాల కోసం వేచి చూడకుండా, బ్యాక్గ్రౌండ్లోనే మొబైల్ నంబర్ను ధృవీకరించే విధంగా ఈ సాంకేతికత పనిచేస్తుంది. వి వినియోగదారులు తమ మొబైల్ నెట్వర్క్ ద్వారా మెటా యాప్లను ఉపయోగిస్తున్నప్పుడు వెరిఫికేషన్ ప్రక్రియ టెలికాం నెట్వర్క్ ద్వారానే నేరుగా పూర్తవుతుందని సంస్థ తెలిపింది. దీని వల్ల యాప్లలో వేగంగా లాగిన్ కావడం, పదేపదే వివరాలు నమోదు చేయాల్సిన అవసరం తగ్గడం, ఫిషింగ్ మరియు డిజిటల్ గుర్తింపు దొంగతనం వంటి ముప్పుల నుంచి మెరుగైన రక్షణ లభిస్తుందని పేర్కొంది. దేశంలో వేగంగా విస్తరిస్తున్న డిజిటల్ వ్యవస్థలో సైబర్ భద్రత, నమ్మకమైన అథెంటికేషన్ ప్రక్రియలకు ఈ సాంకేతికత తోడ్పడుతుందని సంస్థ అభిప్రాయపడింది.

# ఎరువుల సరఫరాలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తద్దు



**ప్రభుత్వం ప్రత్యేక విధానం అమలు**

**రాష్ట్ర వ్యవసాయ శాఖ క్షేత్రస్థాయి డిప్యూటీ డైరెక్టర్ ఆనందరావు**

**పామర్రు, జూన్ 418( మనం న్యూస్):** ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ నుంచే ఎరువుల సరఫరాలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నదని రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యాలయ క్షేత్రస్థాయి డిప్యూటీ డైరెక్టర్ ఎ.ఆనందరావు చెప్పారు. ఖరీఫ్ సాగు సన్నద్ధతపై గురువారం నియోజకవర్గ కేంద్రమైన పామర్రు పట్టణంలోని బొమ్మ రెడ్డి సితారెడ్డి కల్యాణ మండపంలో కృష్ణా జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అన్ని డివిజనల్ స్థాయి వ్యవసాయ అధికారులు, మండల మరియు, సహాయ వ్యవసాయ అధికారులు ఎరువుల దుకాణ దారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ, ఎల్ నేను పరిస్థితులను తగ్గట్టు ఖరీఫ్ సీజన్ 2026 కు ముందస్తు ప్రణాళికలను అమలు చేస్తున్నట్లు తెలిపారు.సాగునీరు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, యంత్ర పరికరాలు, మార్కెటింగ్ వంటి అంశాల్లో ప్రభుత్వ వ్యూహాన్ని వివరించారు. 'జిల్లా వ్యాప్తంగా విత్తనాలు, ఎరువులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయన్నారు.యూరియా సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.ఎరువుల దుర్వినియోగం, అక్రమ రవాణాపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని నిబంధనలు ఉల్లంఘిస్తే డీలర్లపై తక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు .రైతులకు యూరియాను పారదర్శకంగా అందించేందుకు ప్రత్యేక యాప్ విధానాన్ని అమలు చేయనున్నామని చెప్పారు. ఈ ఫెర్టిలైజర్ ప్రత్యేక యాప్ ద్వారా అవసరానికి అనుగుణంగా రైతులుయూరియా పొందే అవకాశం కల్పిస్తామన్నారు.ఎరువులు, విత్తనాల సరఫరా, నిల్వలు, పంపిణీపై నిరంతర పర్యవేక్షణ ఉంటుంది' అని చెప్పారు. ఎల్నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులకు గ్రామాల్లో విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను సూచించారు. సచివాలయ సిబ్బంది ద్వారా ప్రచారం చేయాలని, గ్రామస్థాయిలో సమావేశాలు నిర్వహించాలని చెప్పారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి జ్యోతి రమణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా మార్క్ ఫెడ్ అధికారి మురళి కిషోర్, ఎరువుల దుకాణాల రాష్ట్ర అధ్యక్షుడు నాగిరెడ్డి, డి సి ఓ చంద్రశేఖర్, పామర్రు ఎడియే స్వర్ణలత వ్యవసాయ శాఖ అధికారిని వి.శివ నాగరాణి వీఎ ఏలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల మనసెరిగి విద్యాబోధన చేయాలి


**డివైఈవో పద్మరాణి**




**పామర్రు, జూన్ 4:** విద్యార్థుల మనసెరిగి ఉపాధ్యాయులు బోధన చేయడంతో పాటు గణితం పట్ల మంచి నైపుణ్యాలు విద్యార్థుల్లో పెంపొందించాలని ఉయ్యూరు డివిజనల్ విద్యాశాఖ అధికారిణి ఐ.పద్మరాణి అన్నారు. జ్ఞాన ప్రకాష్ ఇయర్ 3 కార్యక్రమంలో భాగంగా స్థానిక కంచర్ల రామారావు జిల్లా పరిషత్ హై స్కూల్ లో నూతనంగా సెలెక్ట్ అయిన ఉపాధ్యాయులకు క్షేత్రస్థాయి శిక్షణ కార్యక్రమాన్ని మండల విద్యాశాఖ అధికారిని గుమ్మడి పద్మవాణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా డివైఈవో మాట్లాడుతూ, మెగా డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రాథమిక విద్యా బోధనలో అనుసరించవలసిన మెలకువలను వివరించారు. విద్య వృద్ధుల మనసెరిగి విద్యాబోధన చేయడం ద్వారా ఉపాధ్యాయులు విద్యార్థులు మదిలో నిలిచిపోతారన్నారు. ఈ శిక్షణా కార్యక్రమం లో నియోజకవర్గంలోని పామర్రు, తోట్లవల్లూరు, పెదపారుపూడి మొవ్వ పమిడి ముక్కల మండలాలకు చెందిన ఉపాధ్యాయులు కోర్స్ కోఆర్డినేటర్ జి వెంకటేశ్వరరావు, కె ఆర్ పి ఆర్ శివరాం ప్రసాద్ మరియు డిఆర్పీలు పాల్గొన్నారు.

# పుణ్య దంపతులు దేవినేని వెంకటరమణ-ప్రణీతలకిఘన నివాళులు

**నందిగామ,జూన్4,(మనం న్యూస్):** నందిగామ మండలం అంబారుపేట గ్రామంలో స్వర్గీయ దేవినేని వెంకటరమణ 27వ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుణ్య దంపతులు స్వర్గీయ దేవినేని వెంకటరమణ-ప్రణీత ఘాట్ లో పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. దేవినేని వెంకటరమణ ప్రజా సేవకు అంకితభావంతో పనిచేసి ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచారని నాయకులు స్మరించుకున్నారు.కార్యక్రమంలో తెదేపా నాయకులు, కూటమి ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని దేవినేని వెంకటరమణ సేవలను కొనియాడారు. వారి ఆశయాల సాధనకు కట్టుబడి పనిచేస్తామని నాయకులు పేర్కొన్నారు.



# తల సేమియా బాధితున్ని ఆదుకున్న ముఖ్యమంత్రి

**పామర్రు జూన్ 4( మనం న్యూస్ ):** బసవతారకం వైద్యశాలలో ఉచితంగా చికిత్స చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తలసేమియా బాధితునికి సూచించారు. గురువారం ఉదయం జిల్లా కలెక్టర్ వారి చాంబర్లో తల సేమియాతో బాధపడుతున్న 13 ఏళ్ల బాలుడు చాగంటిపాటి వివేక్ కు అతని తాత తల్లి సమక్షంలో 35 వేల రూపాయల బ్యాంకు చెక్కును అందజేశారు. వివరాల్లోకి వెళితే..... గత నెల ఒకటోతేదీన పామర్రు నియోజకవర్గంలోని పమిడిముక్కల మండలంలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా రాష్ట ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్టీఆర్ కాలనీలో లబ్ధిదారులకు స్వయంగా పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎన్టీఆర్ కాలనీలో చాగంటిపాటి వివేక్కు 15వేల రూపాయల పింఛను అందజేశారు. ఆ సమయంలో వివేక్ తల్లి సాయి ప్రసన్న, తాత దామచర్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ వివేక్ గత 13 సంవత్సరాల నుండి తలసేమియా వ్యాధితో బాధపడుతున్నారని, సప్తా ఫౌండేషన్ విజయవాడ వారి సహకారంతో రక్తం మార్పిడి చేయిస్తున్నామన్నారు. తాము పేదవారమని, కుటుంబ ఆర్థిక పరిస్థితులు దృష్ట్యా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, రక్త మార్పిడికి 10 నుంచి 15 వేల రూపాయలు ఖర్చు అవుతుందని, వైద్యం కోసం సాయం చేయాలని వారు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని రాగా ముఖ్యమంత్రి వెంటనే స్పందిస్తూ వారిని అన్ని విధాల ఆదుకుంటానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ వెంటనే విచారించి ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు ద్వారా హైదరాబాదులోని బసవతారకం వైద్యశాల లో ఉచితంగా బోన్ మారో ట్రాన్స్ ప్లాంటేషన్ చేయించుటకు ఏర్పాట్లు చేశారు.. ఇందుకోసం ముందుగా డోనార్ స్పెసిఫిక్ యాంటిజెన్ (డిఎస్ఏ) పరీక్షలు నిర్వహించాల్సి ఉండగా వాటికయ్యే ఖర్చు 35 వేల రూపాయలను జిల్లా డిసిప్లినరీ కమిటీ పరిధిలోని పెనాల్టీ రుసుము నుండి జిల్లా కలెక్టర్ మంజూరు చేశారు. ఇందుకు సంబంధించిన బ్యాంకు చెక్కును జిల్లా కలెక్టర్ చాగంటి పాటి వివేక్ కు అందజేశారు. అంతేకాకుండా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆ బ్యాంకు చెక్కును కూడా ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ సతీష్ దగ్గరుండి వారికి నగదుచేయించి అందజేశారు.. ఈ సందర్భంగా చాగంటి పాటి వివేక్ వారి తల్లి, తాతలు, మాట్లాడుతూ వైద్య పరీక్షలకు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవడంతోపాటు బసవతారకం వైద్యశాలలో ఉచితంగా చికిత్స చేయిస్తున్నందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, కృషిచేసిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజీకి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ సతీష్, పమిడిముక్కల పీహెచ్ సి వైద్యులు డాక్టర్ సైనా తదితరులు పాల్గొన్నారు.



# మల్లాది ప్రసాదరావుకు ఉత్తమ సేవ పురస్కారం



**రెడ్డిగూడెం జూన్ 04 మనం న్యూస్:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించు కొని తెలంగాణ రాష్ట్ర హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాలలో స్వచ్ఛందంగా సేవలందిస్తున్న సామాజిక సేవకులకు 'ఉత్తమ సేవ పురస్కార్' అవార్డులను ఘనంగా ప్రదానం చేశారు. హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు చిన్న యేసు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మేడిది సుబ్బయ్య ట్రస్ట్ చైర్మన్ మేడిది వెంకటేశ్వరరావు, హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ జాతీయ మహిళా అధ్యక్షురాలు రుక్మిణి, సంస్థ వ్యవస్థాపకులు బొడ్డపాటి దాసు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెం గ్రామానికి చెందిన మదర్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు మల్లాది ప్రసాదరావు సమాజ సేవ, పేద ప్రజల సంక్షేమం, విద్య, ఆరోగ్య రంగాల్లో అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తించి 'ఉత్తమ సేవ పురస్కారం'తో సత్కరించారు. అవార్డు అందుకున్న మల్లాది ప్రసాదరావు మాట్లాడుతూ, ఈ గుర్తింపు తనపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో కూడా సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా మదర్ సర్వీస్ సొసైటీ సభ్యులు, గ్రామ పెద్దలు, శ్రేయోభిలాషులు మల్లాది ప్రసాదరావును అభినందించి, మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు.

# దేవినేని వెంకటరమణ కి నందిగామలో ఘన నివాళులు

**▸▸ తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ దేవినేని ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆధ్వర్యంలో నివాళులర్పణ – ఎన్టీఆర్ ఫోటో గ్యాలరీ ప్రత్యేక ఆకర్షణ..**



**నందిగామ,జూన్4(మనం న్యూస్):** ప్రజానాయకుడు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు స్వర్గీయ దేవినేని వెంకటరమణ వర్ధంతి సందర్భంగా నందిగామ పట్టణంలో ఘనంగా నివాళులు అర్పించారు. రైతుపేటలోని దేవినేని వెంకటరమణ విగ్రహానికి, గాంధీ సెంటర్లో ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ దేవినేని ఉమామహేశ్వరరావు, పార్టీ నాయకులతో కలిసి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గాంధీ సెంటర్లో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు, ప్రజలకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దేవినేని వెంకటరమణ ప్రజాసేవలను, పార్టీ అభివృద్ధికి ఆయన చేసిన విశిష్ట సేవలను నాయకులు స్మరించుకున్నారు. కాగా, ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షులు వడ్డెల్లి సాంబశివరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారకరామారావు అరుదైన చిత్రాలతో కూడిన ఫోటో గ్యాలరీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎన్టీఆర్ జ్ఞాపకాలను తలచుకున్నారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# బిజెపి పెంచిన ధరలను ప్రశ్నించలేని కూటమి, వైసిపి పార్టీలు

**▸▸ భయం నీడలో అధికార ప్రతిపక్షాలు**

**▸▸ పొదుపు మంత్రం అంతా ఒకరోజు షో**

**▸▸ డి.వి కృష్ణ, సిపిఎం పార్టీ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి**



**నందిగామ,జూన్4,(మనం న్యూస్):** యుద్ధం పేరు సాకుగా చూపి పెట్రోల్ డీజిల్ ధరలు పెంచడం వల్ల సామాన్యుడు పై అధిక భారం పడుతుందని కేంద్రాన్ని ప్రశ్నించలేని కూటమి, వైసీపీ ప్రభుత్వాలు భయం నీడలో బతుకుతున్నాయని సిపిఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డివి కృష్ణ అన్నారు. నందిగామలో సుందరయ్యభవన్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... యుద్ధం వల్ల పన్నులు తగ్గించాలి గాని ప్రజల్ని పొదుపు చేయమనడం అవివేకం అన్నారు. వీళ్ళు మాత్రం పొదుపు పేరుతో ఒకరోజు సైకిల్ తొక్కి చిత్రీకరణకు కార్లతో వెళ్లారని ఒకరోజు మాత్రమే వీళ్ళు పొదుపు చేశారు అని మిగిలిన రోజులు ప్రజలు చేయమని వక్రమార్గం పట్టిస్తున్నారన్నారు. పెట్రోల్ డీజిల్ ఇప్పటికీ నాలుగు సార్లు పెంచి 117 రూపాయలు అయిందని దీనివల్ల రవాణా రంగం కుంటు పడుతోందని నిత్యవసరాలు ధరలు పెరిగిపోయాయని హోటళ్లు మూతపడ్డాయని లారీ, ఆటో రంగాలు కుదేలైయ్యాయని దీనివల్ల కార్మికులు ఉపాధి కోల్పోయారని ఈ సందర్భంగా జూన్ 9వ తారీఖున వామపక్షాల ఆధ్వర్యంలో రాస్తారోకోకు పిలుపునిచ్చామని దానిని జయప్రదం చేయాలని ఆయన కోరారు. యుద్ధం పేరుతో ఎరువులు ధరలు పెంచడం డీఏపీ యూరియా కొరత సృష్టించడం రష్యా, ఇరాన్ వద్ద గ్యాస్ తీసుకోకుండా ట్రంప్ అడ్డుకోవడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నామని, మోడీ, బిజెపి ట్రంప్ కు వంత పాడుతూ దేశ ప్రజలను దోచి కార్పొరేట్లకు కట్టబెడుతున్నారు. ట్రంప్ కి ఎదురు చెప్పలేని మోడీ ఆ భారాలను మనపై రుద్దుతున్నారని అన్నారు. పెట్రోల్ గ్యాస్ డీజిల్ పేరు మీద ఈ 12 సంవత్సరాల కాలంలో ప్రజల వద్ద నుండి 65,56,188 కోట్ల రూపాయలు ప్రజల నుంచి పన్నులు వసూలు చేశారని అంతర్జాతీయ మార్కెట్లో బ్యారెల్ ధర తగ్గినా మన దేశంలో రేట్లు ఎందుకు పెరుగుతున్నాయో మోడీ చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.వీ ఆంజనేయులు, ఎన్సిహెచ్. శ్రీనివాస్, కోట కళ్యాణ్, కటారపు గోపాల్ విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు.

# అమ్మవారి సేవలో జాతీయ ఎస్టీ కమిషన్ చైర్మన్ అంతర్ సింగ్ ఆర్యా

**విజయవాడ, ఇంద్రకీలాద్రి జూన్ 4 (మనం న్యూస్)** జాతీయ ఎస్టీ కమిషన్ చైర్మన్ శ్రీ అంతర్ సింగ్ ఆర్య గురువారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో వి.కె. శీనా నాయక్ అధికారిక ప్రోటోకాల్ ప్రకారం ఘన స్వాగతం పలికారు. విఐపీ ప్రోటోకాల్ నిబంధనలకు అనుగుణంగా చైర్మన్, ఆయన బృందానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. చైర్మన్ అంతర్ సింగ్ ఆర్య అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందజేశారు.



# కూటమి విజయానికి రెండేళ్లు.. సంబరాల్లో టీడీపీ శ్రేణులు



**విజయవాడ తూర్పు, జూన్ 4 ( మనం న్యూస్):** విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని చిన్ని కూటమి అభ్యర్థిగా విజయం సాధించి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా గురునానక్ కాలనీలోని ఆయన కార్యాలయంలో గురువారం టీడీపీ, కూటమి శ్రేణులు సంబరాలు నిర్వహించాయి. ఎంపీ చిన్ని విజయంతో పాటు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. ఈ కార్యక్రమానికి స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి, దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), గ్రంథాలయ సంస్థ చైర్మన్ బేగ్, మార్కెట్ యార్డు చైర్మన్ నర్రా వాసు, టీడీపీ సీనియర్ నాయకులు బొప్పన భవకుమార్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనకు ప్రజలు స్వస్తి పలికి కూటమి ప్రభుత్వానికి ఘన విజయం అందించారని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్ సమన్వయంతో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని అన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రం పలు రంగాల్లో వెనుకబడిందని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే ప్రజలు కూటమికి అండగా నిలిచారని వ్యాఖ్యానించారు. అమరావతి నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పన, రహదారులు, ఆర్యూబీలు, డ్రైనేజీ పనులు, పరిశ్రమలు, పర్యాటకం, క్రీడలు తదితర రంగాల్లో విజయవాడ పార్లమెంట్ పరిధిలో ఎంపీ కేశినేని చిన్ని కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. భవిష్యత్తులో కూడా విజయవాడ పార్లమెంట్లో, రాష్ట్రవ్యాప్తంగా కూటమి విజయ పరంపర కొనసాగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చెన్నుపాటి గాంధీ, జాస్తి సాంబశివరావు, తూమాటి ప్రేమ్నాథ్, నూతలపాటి నారద, షేక్ ఆషా, ఉషారాణి ప్రసాద్, మాదిగని గురునాథం, ఫతావుల్లా, కాకు మల్లికార్జున్ యాదవ్, నరసింహం చౌదరి, పిల్లా శ్రీనివాసరావు, రాజేశ్వరరావు, వ్యాస్, సోలంకి రాజు, శిరీష గాంధీ, కిలారి చంద్రశేఖర్, మాధవి, పరిసపోగు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# నవజాత శిశువు వైద్యానికి రూ.6.18 లక్షల ఎల్ఓసీ

**విజయవాడ పశ్చిమ జూన్ 4 ( మనం న్యూస్)**నవజాత శిశువు అత్యవసర వైద్యం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.6.18 లక్షల విలువైన ఎల్ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్)ను గురువారం ఎన్డీఏ కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎమ్మెల్యే సుజనా చౌదరి చొరవతో మంజూరైన ఎల్ఓసీని మాజీ కార్పొరేటర్ బుల్లా విజయ్కుమార్, కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, కూటమి నాయకులు కలిసి అందజేశారు.51వ డివిజన్కు చెందిన అనంతలక్ష్మి (21) ఇటీవల ఓ ప్రైవేటు ఆసుపత్రిలో శిశువుకు జన్మనిచ్చారు. ప్రతికూల గర్భధారణ కారణంగా శిశువుకు అత్యవసర వైద్యం అవసరం కావడంతో కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం కోసం ఎన్డీఏ కార్యాలయం ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే సుజనా చౌదరి చొరవతో రూ.6.18 లక్షల ఎల్ఓసీ మంజూరైంది. త్వరితగతిన స్పందించి ఆర్థిక సహాయం అందించడంతో బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే సుజనా చౌదరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బొడ్డుపల్లి శ్రీనివాసరావు, బొల్లేపల్లి కోటేశ్వరరావు, ఏలూరు సాయి శరత్, దుర్బేసుల హుస్సేన్, డాక్టర్ హనుమంతరావు, పోలవరపు దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



# హరిత ఆలోచనలతో భావి తరాలను తీర్చిదిద్దాలి

- చిన్నప్పటి నుంచే పర్యావరణంపై అవగాహన ఉండాలి
- ప్రకృతిపై మమకారంతోనే సమాజంపై బాధ్యత పెరుగుతుంది
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**పి.మీరాహుస్సేన్ ఖాన్**



(విజయవాడ,మనం బ్యూరో..)ః పర్యావరణ పరిరక్షణపై చిన్నప్పటి నుంచే అవగాహన కల్పిస్తే విద్యార్థులు బాధ్యతాయుత పౌరులుగా ఎదుగుతారని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ప్రకృతిని ప్రేమించడం, పర్యావరణాన్ని సంరక్షించడం వంటి విలువలు బాల్యంలోనే అలవడితే సమాజం పట్ల



బాధ్యతాభావం పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ నెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నగరంలోని సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ లో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. డ్రీమ్ వర్క్స్ ఆర్ట్ గ్యాలరీ, ఆంధ్రప్రదేశ్ క్రియేటివిటీ కల్చర్ కమిషన్, ఎన్.టి.ఆర్.జిల్లా అధికార యంత్రాంగం, కొమ్మారెడ్డి వెంకట సదాశివరావు సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్, విజయవాడ. ఎ.పి.సర్వోదయ మండలి, రూట్ హెల్త్ ఫౌండేషన్, సర్వోదయ ట్రస్ట్, జి.ఆర్.కె.పోలవరపు కోటేశ్వరరావు సాంస్కృతిక సమితి, మార్పు వెల్ఫేర్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి 200 మంది ప్రఖ్యాత చిత్రకారులతో ఆర్ట్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. అదేవిధంగా పాఠశాల, కాలేజీ విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై చిత్రలేఖనం, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ వాతావరణ మార్పులు, కాలుష్యం, నీటి సంరక్షణ, జీవ వైవిధ్య పరిరక్షణ వంటి అంశాలపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడం అవసరమన్నారు. పర్యావరణ పరిరక్షణను కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా జీవన విధానంగా మార్చుకోవాలని సూచించారు. విద్యార్థులు మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం, ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండటం, నీటిని పొదుపుగా వినియోగించడం వంటి మంచి అలవాట్లను అలవరచుకోవాలని సూచించారు. ప్రకృతిపై మమకారం పెరిగినప్పుడే పర్యావరణ పరిరక్షణ పట్ల నిబద్ధత ఏర్పడుతుందని, అలాంటి చైతన్యవంతులైన యువతతోనే సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ప్రతి విద్యార్థి హరిత కార్యక్రమాల్లో భాగస్వామి కావాలని, పరిశుభ్రమైన, పచ్చని పరిసరాల నిర్మాణానికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణకు కృషిచేస్తున్న ప్రతి సంస్థకు, వ్యక్తికీ అభినందనలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్ధన్ పాల్గొని పర్యావరణ పరిరక్షణపట్ల మార్గనిర్దేశం చేశారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం పెరిగినప్పుడే సమాజంలో సానుకూల మార్పు సాధ్యమవుతుందని అన్నారు. ప్రకృతిని కాపాడటం అంటే మన భవిష్యత్తును కాపాడటమేనని పేర్కొంటూ, పర్యావరణ పరిరక్షణను ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో సిద్ధార్థ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ సునీత, డ్రీమ్ ఆర్ట్ అకాడమీ సెక్రెటరీ రమేష్, జీఆర్కే పోలవరపు సమితి అధ్యక్షులు గోళ్ళ నారాయణరావు, మార్పు సంస్థ నుంచి తులసి పద్మశ్రీ, సర్వోదయ నుంచి రాంబాబు నాయుడు, మోతుకూరి వెంకటేశ్వరరావు, రూట్ హెల్త్ ఫౌండేషన్ విజయభాస్కర్, న్యాయవాది నరేంద్రకుమార్, కళాసాగర్ పాల్గొన్నారు.






## నిత్య అన్నదాన పథకానికి రూ.1 లక్ష విరాళం



**విజయవాడ ఇంద్రకీలాద్రి, జూన్ 4 (మనం న్యూస్)ః** ఇంద్రకీలాద్రిపై వెలసిన శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివారి దేవస్థాన నిత్య అన్నదాన పథకానికి మంగళగిరికి చెందిన పీవీపీ కృష్ణకుమార్ కుటుంబ సభ్యులు విరాళం అందజేశారు. కుటుంబ సభ్యులు అనిల్కుమార్ దంపతుల పేరున రూ.1,00,116 (ఒక లక్ష నూట పదహారు రూపాయలు)లను దేవస్థాన అధికారులకు గురువారం స్వయంగా అందించారు. దాతల విరాళాన్ని దేవస్థాన అధికారులు స్వీకరించి, వారికి ఆలయ ప్రసాదాలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. నిత్య అన్నదాన పథకానికి భక్తులు అందిస్తున్న విరాళాలు అన్నదాన సేవల నిర్వహణకు ఉపయోగపడుతున్నాయని అధికారులు పేర్కొన్నారు. అనంతరం వేద ఆశీర్వచనం అమ్మవారి చిత్రపటం శేష వస్త్రం ప్రసాదాలు అందజేశారు.

## ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేసిన సీఐ ప్రభాకర్

**విజయవాడ, సెంట్రల్ జూన్ 4 (మనం న్యూస్)ః** ఎండల తీవ్రత నేపథ్యంలో ప్రజలకు ఉపశమనం కల్పించేందుకు ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం పైపుల రోడ్ సెంటర్లో మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. విజయవాడ నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్బాబు ఆదేశాలు, డీసీపీ (ట్రాఫిక్) షేక్ షరీన్ బేగం సూచనల మేరకు చేపట్టిన ఆరో రోజుకు చేరుకుంది. ఏసీపీ శ్రీ వేద అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీఐ ప్రభాకర్, ఎస్ఐ కృష్ణతో పాటు ట్రాఫిక్ సిబ్బంది పాల్గొని వాహనదారులు, పాదచారులకు మజ్జిగ పంపిణీ



చేశారు. వేసవి వేడిమి నుంచి ఉపశమనం కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## ప్రజల విశ్వాసంతో కూటమి ప్రభుత్వానికి రెండేళ్లు

- బొండా ఉమా

**విజయవాడ సెంట్రల్ జూన్ 4 (మనం న్యూస్):** ప్రజల ఆశీర్వాదాలు, విశ్వాసంతో కూటమి ప్రభుత్వం రెండేళ్లు విజయవంతంగా పూర్తి చేసుకుందని ప్రభుత్వ విప్, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. సింగ్నగర్లోని తన కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024లో ప్రజలు రాష్ట్ర పునర్నిర్మాణం కోసం కూటమికి చారిత్రాత్మక తీర్పు ఇచ్చారని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో సంక్షేమం, అభివృద్ధి సమన్వయంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. పెన్షన్ల పెంపు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, అన్నా క్యాంటీన్ల పునఃప్రారంభం వంటి హామీలను అమలు చేశామని చెప్పారు.సెంట్రల్ నియోజకవర్గంలో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాలు, విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ప్రజా దర్బార్, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాసరి ఉదయశ్రీ, నియోజకవర్గ కోఆర్డినేటర్ నవనీతం సాంబశివరావు, కార్యాలయ కార్యదర్శి ఘంటా కృష్ణమోహన్ పాల్గొన్నారు.



# మోదీ పుష్కర కాలం పాలన...

- దేశ చరిత్రలో ఒక స్వర్ణాధ్యాయం
- బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి



**మార్కాపురం.జూన్,04,(మనం న్యూస్)ః** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం విజయవంతంగా పూర్తి చేసుకున్న 12 సంవత్సరాల సుపరిపాలన దేశ చరిత్రలో ఒక స్వర్ణాధ్యాయంగా నిలిచిందని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన, పారదర్శకత, జాతీయ భద్రత, పేదల సాధికారత, మహిళా సాధికారత, రైతు సంక్షేమం, యువతకు అవకాశాల కల్పన వంటి అనేక రంగాల్లో దేశం అపూర్వమైన పురోగతి సాధించిందని ఆయన అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం ప్రపంచ వేదికపై తన ప్రత్యేక గుర్తింపును మరింత బలోపేతం చేసుకుందని, ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా ఎదిగి, అంతర్జాతీయ స్థాయిలో భారత ప్రతిష్ఠను మరింత పెంచుకుందని తెలిపారు. గత 12 సంవత్సరాల కాలంలో దేశవ్యాప్తంగా ఆధునిక రహదారులు, ఎక్స్ప్రెస్ వేలు, విమానాశ్రయాలు, రైల్వే ఆధునీకరణ, పోర్టుల అభివృద్ధి వంటి మౌలిక సదుపాయాల రంగంలో ఎన్నో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. పేదల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిచ్చిందని, ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా కోట్లాది కుటుంబాలకు గృహాలు, జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీరు, ఉజ్వల యోజన ద్వారా మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు, ఆయుష్మాన్ భారత్ ద్వారా పేదలకు ఆరోగ్య భద్రత, పీఎం కిసాన్ ద్వారా రైతులకు ఆర్థిక సహాయం అందించిందన్నారు. డిజిటల్ ఇండియా కార్యక్రమం ద్వారా సాంకేతిక రంగంలో దేశాన్ని ముందంజలో నిలబెట డంతో పాటు పారదర్శక పాలనకు కొత్త నిర్వచనం తీసుకువచ్చిందని తెలిపారు. మహిళా సాధికారతకు కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిచ్చిందని, మహిళల గౌరవం, భద్రత, ఆర్థిక స్వావలంబన కోసం అనేక కీలక నిర్ణయాలు తీసుకుందని అన్నారు. 'యువతకు ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్ల ప్రోత్సాహం ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు పెరిగాయని తెలిపారు. జాతీయ భద్రత విషయంలో కేంద్ర ప్రభుత్వం ఎలాంటి రాజీ పడకుండా దేశ సరిహద్దులను మరింత పటిష్టం చేసి, ప్రపంచ దేశాల మధ్య భారతదేశాన్ని శక్తివంతమైన దేశంగా నిలబెట్టిందన్నారు. ఈ 12 సంవత్సరాల సుపరిపాలన విజయాలను ప్రజలకు చేరవేసే లక్ష్యంతో జూన్ 5 నుండి జూన్ 21 వరకు దేశవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయని.. ఈ కార్యక్రమాల ద్వారా కేంద్ర ప్రభుత్వం సాధించిన విజయాలు, అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, భారతదేశం సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు, మేధావులు మరియు సాధారణ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. అభివృద్ధి చెందిన భారత నిర్మాణంలో ప్రతి భారతీయుడు భాగస్వామి కావాలని, 'వికసిత్ భారత్-2047' లక్ష్య సాధనలో ప్రజలందరూ తమ వంతు పాత్ర పోషించాలని కోరారు. మోదీ నాయకత్వంలో గత 12 సంవత్సరాల్లో సాధించిన విజయాలు దేశ భవిష్యత్తుకు బలమైన పునాది వేశాయని, రానున్న కాలంలో భారతదేశం ప్రపంచంలోనే అగ్రగామి దేశంగా అవతరించే దిశగా మరింత వేగంగా ముందుకు సాగుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. జూన్ 5 నుంచి 21 వరకు నిర్వహించనున్న కార్యక్రమాలను ప్రజల భాగస్వామ్యంతో ఘన విజయవంతం చేసి, సుపరిపాలన సందేశాన్ని ప్రతి ఇంటికి చేరవేర్చుకుందామని బిజెపి రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రా రెడ్డి పిలుపునిచ్చారు.

# విస్సన్నపేట కోనేరు చెరువునకు మహర్దశ

**విస్సన్నపేట,జూన్4(మనం న్యూస్)ః** విస్సన్నపేటలోని కోనేరు చెరువు వేగంగా సుందరీకరణ పనులతో సరికొత్త రూపాన్ని సంతరించుకుంటోంది. కాలుష్య రహితంగా, మురుగునీరు లేని స్వచ్ఛమైన నీటితో కొద్దిరోజుల్లోనే ఇది ఆహ్లాదకరమైన నందనవనంగా మారనుంది. ప్రజల ఆరోగ్యం కోసం ఇక్కడ వాకింగ్ ట్రాక్, వ్యాయామం చేసుకునేలా అధికారులు పనులను పర్యవేక్షిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఆహ్లాదం పంచేలా చెరువు మారుతుండటంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# రాష్ట్రంలో తొలిసారిగా కలెక్టర్ వినూత్న చొరవ



- స్వర్ణ గ్రామం, వార్డు ఉద్యోగులకు సామర్థ్య నిర్మాణం
- ప్రతి గురువారం ప్రత్యేక మాడ్యూల్‌తో సెషన్లు
- ఒత్తిడి రహిత వాతావరణంలో విధుల నిర్వహణకు బాటలు

**(విజయవాడ, మనం బ్యూరో)ః** గ్రామాలు, వార్డులను ఆదర్శవంతమైన పరిపాలన సేవల కేంద్రాలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యాలయాల ఉద్యోగులకు ప్రతి గురువారం మధ్యాహ్నం గంటన్నరపాటు సామర్థ్య నిర్మాణ (కెపాసిటీ బిల్డింగ్) కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఎన్టీఆర్ జిల్లా మానవ వనరుల అభివృద్ధి (హెచ్ఆర్డీ) సెల్, ఆకర్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో 40 మంది స్వర్ణగ్రామం-స్వర్ణ వార్డు సిబ్బందికి స్ట్రెస్ మేనేజ్మెంట్ పై తొలి వర్క్షాప్ను కలెక్టర్ లక్ష్మీశ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ప్రజా సేవల అందజేత, సమస్యల పరిష్కారం, డిజిటల్ సేవల నిర్వహణ, కార్యాలయ వ్యవహారాలు తదితర అంశాల్లో సిబ్బంది నైపుణ్యాలను మరింత మెరుగుపరిచేందుకు, ఒత్తిడిని అధిగమించి మంచి ఫలితాలు రాబట్టే ఉద్దేశంతో వినూత్నంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. శిక్షణల ద్వారా ఉద్యోగులు తమ విధులపై సమగ్ర అవగాహన పెంపొందించుకుని ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు లక్ష్యాల సాధనలో సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని, మారుతున్న సాంకేతికత, పరిపాలనా విధానాలకు అనుగుణంగా నిరంతరం నైపుణ్యాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. ఇందుకోసం వివిధ విభాగాల నిపుణులు శిక్షణా కార్యక్రమాల్లో పాల్గొని సంబంధిత అంశాలపై మార్గనిర్దేశం చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సైకాలజిస్టులు జగదీష్, నవితశ్రీ పాల్గొని ఒత్తిడికి కారణాలు, భౌతిక లక్షణాలు, ఉద్వేగ లక్షణాలు, ప్రవర్తనలో వచ్చే మార్పు, పని ఒత్తిడికి కారణాలు, స్ట్రెస్ మేనేజ్మెంట్ టెక్నిక్స్ను వివరించారు. కార్యక్రమంలో స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు జిల్లా అధికారి కేవీఎస్ఆర్ రవికుమార్, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి జి.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# దుగ్గిరాలలో 'చంద్రబాబు వెన్నుపోటుకు 2 ఏళ్లు' - వైసీపీ నిరసన




**దుగ్గిరాల, జూన్ 4, మనం న్యూస్ః** చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా 'వెన్నుపోటు దినం' పేరుతో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్త నిరసన కార్యక్రమాలు చేపట్టింది. . అందులో భాగంగా గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గం దుగ్గిరాల మండల కేంద్రంలో సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు..దుగ్గిరాల శివాలయంలో వద్దా నుండి పోలీస్ స్టేషన్ మీదగా పార్టీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.. అనంతరం చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టోని పేపర్లను చింపి నిరసన తెలియజేశారు..వైఎస్ జగన్ పిలుపు మేరకు రాష్ట్రంలోని అన్ని మండల హెడ్క్వార్టర్లో నిరసనలు తెలుపుతున్నామని వేమారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి దుగ్గిరాల మండలం అధ్యక్షులు తాడిబోయిన శివగోపయ్య అధ్యక్షతన నాయకులు కార్యకర్తలు ప్రజలతో పాటు తాడేపల్లి, మంగళగిరి మండలాల నుంచి కూడా ప్రజలు హాజరయ్యారు.. దొంగల రాజ్యం, దోపిడీ రాజ్యం పోవాలి, నిజమైన ప్రజాస్వామ్య ప్రభుత్వం రావాలి అని నేతలు ఆకాంక్షించారు..ఈసందర్భంగా మీడియాతో ఇంచార్జ్ వేమారెడ్డి మాట్లాడుతూ.నిరుద్యోగ భృతి 20 లక్షల మందికి ఉద్యోగాలు లేదా నెలకు 3,000 ఇస్తామని హామీ ఇచ్చారని, రెండేళ్లుగా ఇవ్వలేదని, ఒక్కొక్క నిరుద్యోగికి 72,000 బకాయి ఉందని ఆరోపించారు..మహిళలకు ఆర్థిక సాయం 18-45 ఏళ్ల అర్హులైన మహిళలకు నెలకు 1,500 చొప్పున రెండేళ్లకు 36,000 బకాయి ఉందని, వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.ఉచిత గ్యాస్ 3 సిలిండర్లు ఉచితంగా ఇస్తామని చెప్పి ఒకటే ఇచ్చారని విమర్శించారు..రైతు భరోసా రైతుకు 20,000 ఇస్తామని చెప్పారని, రెండేళ్లకు 40,000 బకాయి ఉందని, అక్కడక్కడా ఇచ్చింది ఏ మూలకూ సరిపోదని పేర్కొన్నారు.. వరి, మొక్కజొన్న, పత్తి, ఉల్లి తదితర పంటలకు గిట్టుబాటు ధర లేదని వాపోయారు..ఉచిత బస్సు 16 సర్వీసులకు గాను కేవలం 5 సర్వీసులకే మహిళలకు ఉచితం అమలు చేస్తున్నారని తెలిపారు..పెన్షన్ 4,000 పెన్షన్ ఇస్తూనే 6.20 లక్షల మంది లబ్ధిదారులకు కోత విధించారని ఆరోపించారు..రాజధాని ప్రాంతంలో అనుచరులతో మట్టి వ్యాపారం బ్రహ్మాండంగా జరుగుతోందని ఆరోపించారు.. చెరువుల కింద 687 ఎకరాల్లో 10-15 మీటర్ల లోతున లక్షలాది క్యూబిక్ మీటర్ల మట్టిని తవ్వి వేల కోట్లు సమపార్జన చేస్తున్నారని విమర్శించారు.. అదేవిధంగా ఇసుక నుంచి గతంలో ఏటా 750 కోట్ల ఆదాయం వస్తే, రెండేళ్లలో 1500 కోట్లు ఎవరి జేబుల్లోకి వెళ్లాయని ప్రశ్నించారు..ఫీజు రీయింబర్స్మెంట్ లేక విద్యార్థుల చదువులు ఆగిపోయాయని, రైతులు, మహిళలు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు.. రాజధాని రైతులు నిద్రలేకుండా గడుపుతున్నారని, అమరావతిలో ఒక రైతు సభలోనే గుండె ఆగి మరణించారని గుర్తు చేశారు..ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే పేదవాడి ఆగ్రహానికి గురికాక తప్పదని, ప్రజా ఆగ్రహం పెరగకముందే సంక్షేమ పథకాలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.. జగన్ ప్రభుత్వం ఇచ్చిన పథకాలతో పాటు కూటమి ప్రభుత్వం ఇస్తామన్న హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు.. ఈ కార్యక్రమంలో మంగళగిరి పట్టణ అధ్యక్షులు ఆకురాతి రాజేష్ మంగళగిరి మండలం అధ్యక్షులు నాలి వెంకటకృష్ణ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాలస్వామి రెడ్డి తాడేపల్లి మండలం అధ్యక్షులు అమరా నాగయ్య రాష్ట్ర, జిల్లా నియోజకవర్గ మండల వివిధ విభాగ నాయకులు మహిళా నాయకురాలు వైసీపీ శ్రేణులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# అభివృద్ధి పనుల నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలు తప్పక పాటించాలి



**గుంటూరు నగరపాలక సంస్థ జూన్ 4 (మనం న్యూస్ ప్రతినిధి):** గుంటూరు నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనులలోనూ నాణ్యత అత్యంత ప్రధానమని, నాణ్యత ప్రమాణాల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడే ప్రసక్తే లేదని గుంటూరు నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు.గురువారం నగరంలోని చుట్టుగుంట, మురికిపేట, వి.ఐ.పి రోడ్డు, కృష్ణ బాబు కాలని, చంద్రబాబు నాయుడు కాలని తదితర ప్రాంతాలలో క్షేత్రస్థాయిలో పర్యటించి,సదరు ప్రాంతాలలో జరుగుతున్న మరియు పూర్తైన అభివృద్ధి పనులను పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యల పై సంబందిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. పర్యటనలో తొలుత చుట్టుగుంట, మురికిపేటలలో జరుగుతున్న డ్రైన్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ,గతంలో సదరు ప్రాంతాలలో డ్రైన్లు సరిగా లేకపోవుట వలన వర్షాలు పడినప్పుడు సదరు ప్రాంతంలోని గృహాలలోకి మురుగు నీరు చేరి స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, అందువలన రానున్న వర్షా కాలాన్ని దృష్టిలో ఉంచుకొని వర్షాలు పడినప్పుడు మురుగునీరు గ్రుహాలలోకి రాకుండా, మురుగు నీరు పారుదలకు ఎటువంటి అడ్డంకులు లేకుండా, డ్రైన్ల నిర్మాణంలో వంకర లేకుండా నిర్మించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే సదరు ప్రాంతంలో మురుగునీటి పారుదలకు అనుగుణంగా కల్వర్టు నిర్మించడానికి థర్డ్ పార్టీ వారి అభిప్రాయం తీసుకొని, అవసరం మేరకు కల్వర్ట్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే చుట్టుగుంట నుండి మెడికల్ క్లబ్ వరకు నిర్మిస్తున్న డ్రైన్లకు ఎటువంటి ఆక్రమణలు బెడద లేకుండా తొలగించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వి.ఐ.పి రోడ్డు, కృష్ణ బాబు కాలని,చంద్రబాబు నాయుడు కాలనిలలో నిర్మించిన సిసి రోడ్లు,సిసి డ్రైన్ల నిర్మాణాలను పరిశీలించి, అభివృద్ధి పనుల నిర్వహణలో నూరు శాతం నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల నిర్వహణలో వివిధ విభాగాల మధ్య సరైన సమన్వయం ఉంటేనే పనులు వేగంగా మరియు సమర్ధవంతంగా పూర్తి అవుతాయన్నారు. ప్రారంభించిన అభివృద్ధి పనులు పెండింగ్ పెట్టకుండా కాంట్రాక్టర్లు పూర్తి చేసేలా ఇంజనీరింగ్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రధానంగా వర్షాకాలంలో సమస్య తలెత్తకుండా కల్వర్ట్ లు, డ్రైన్ల నిర్మాణ పనులను యుద్దప్రాతి ఎదికన పూర్తీ చేయాలన్నారు. అనంతరం ప్రధాన డ్రైన్లలో తీస్తున్న సిల్ట్ తొలగింపు పనులను పరిశీలించి, వర్షాలు ప్రారంభం కాకముందే పూడికతీత పనులను యుద్దప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో ఎస్ఈ వెంకటేశ్వరరావు, ఈఈలు విష్ణు, కళ్యాణరావు, డిఈఈ ఈదర శ్రీనివాసరావు, ఏ.ఈలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

# గుంటూరు ప్రజలకు ముఖ్య గమనిక !

**గుంటూరు నగర పాలక సంస్థ జూన్ 4 (మనం న్యూస్ ప్రతినిధి):** ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి నిరంతరాయంగా అందాలంటే ఈ-కేవైసీ (ఛ-ఓ్గఇ) పూర్తి చేసుకోవడం తప్పనిసరి అని పేర్కొన్న నగర కమిషనర్ కె. మయూర్ అశోక్.ప్రభుత్వ సేవలను మరింత సులభంగా పొందడానికి 'మనమిత్ర' వేదికను ఉపయోగించుకోవచ్చు ఈ-కేవైసీ (ఛ-ఓ్గఇ): అర్హులైన లబ్ధిదారులు తమ ఆధార్ వివరాలను నవీకరించి, ఈ-కేవైసీని వేగంగా పూర్తి చేసుకోవాలి₹ దీనివల్ల సంక్షేమ పథకాల ప్రయోజనాలు సకాలంలో, పారదర్శకంగా అందుతాయి.ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా. వివిధ ప్రభుత్వ సేవలు, సర్టిఫికెట్స్, సమాచారాన్ని డిజిటల్ విధానంలో సులభంగా మనమిత్ర సేవల ద్వారా పొందవచ్చు. సచివాలయ సిబ్బంది తమకు కేటాయించిన



ప్రాంతాల్లోని ప్రజలకు, ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, దివ్యాంగులకు ఈ సేవలపై ప్రత్యేక అవగాహన కల్పించాలి ప్రజల సహకారంతోనే ప్రభుత్వ సేవల పంపిణీ మరింత సమర్థవంతంగా జరుగుతుంది. ప్రజలంతా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి డిజిటల్ సేవల ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని, ఈకెవైసీకి సహకరించాలని కోరిన కమిషనర్

# సర్వే ఏ.డిగా సజ్జ వెంకటేశ్వరావు



**▸▸ జిల్లా కలెక్టర్ ను మర్యాద పూర్వకంగా కలిసిన ఏ.డి**

**గుంటూరు, జూన్ 4 : (మనం న్యూస్ ప్రతినిధి):** గుంటూరు జిల్లా సర్వే శాఖ సహాయ సంచాలకులుగా సజ్జ వెంకటేశ్వరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. పల్నాడు జిల్లాలో సర్వే ఇన్స్పెక్టర్ గా పనిచేస్తు పదోన్నతిపై గుంటూరు సహాయ సంచాలకులుగా నియమితుల య్యారు.జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మను జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసారు. జిల్లాలో సర్వే, రీ సర్వే పనులు విజయవంతంగా పూర్తి చేయుటకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ఈ సందర్భంగా జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, సర్వే శాఖ ఉపసంచాలకులు తోయజాక్షజ రావు పాల్గొన్నారు.

# నేడు పెదనందిపాడులో ఒక నెల - ఒక నియోజకవర్గం - నాలుగు సందర్శనలు కార్యక్రమం

**▸▸ పెదనందిపాడులో మధ్యాహ్నం 3 గంటల నుండి కార్యక్రమం**

**▸▸ పెదనందిపాడు, కాకుమాను మండలాల ప్రజలు అర్జీలు సమర్పించవచ్చు**

**గుంటూరు, జూన్ 4 : (మనం న్యూస్ ప్రతినిధి):** ఒక నెల - ఒక నియోజకవర్గం - నాలుగు సందర్శనలు కార్యక్రమాన్ని శుక్రవారం



ప్రత్తిపాడు నియోజకవర్గం పెదనందిపాడులో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పెదనందిపాడులో ఆర్య వైశ్య కళ్యాణ మండలంలోమధ్యాహ్నం 3 గంటల నుండి కార్యక్రమం ప్రారంభం అవుతుందని చెప్పారు. ఇందులో ప్రజా ప్రతినిధులు భాగస్వామ్యం కావాలని కోరారు. జిల్లా అధికారులు, నియోజకవర్గంలోని మండకాల అధికారులు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆదేశించారు. పెదనందిపాడు, కాకుమాను మండలాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను హాజరైన ప్రజా ప్రతినిధులు, అధికారులకు అందజేయవ చ్చని జిల్లా కలెక్టర్ వివరించారు.

# భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలి



**గుంటూరు, జూన్ 4 : (మనం న్యూస్ ప్రతినిధి):** రాజధాని భూముల భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సి.ఆర్.డి.ఎ అడిషనల్ కమీషనర్ కొల్లాబత్తుల కార్తీక్ తో కలసి రాజధాని భూసేకరణ గురించి జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ - 3, ఈ - 13, ఈ -15 పరిధిలోని సీడ్ యాక్సిస్ రోడ్డు, స్టీల్ బ్రిడ్జి, ఎన్ హెచ్ 16 ను కలిపే విధంగా ట్రంకు రోడ్డు తదితర నిర్మాణాలకు అవసరమైన భూ సేకరణ ప్రక్రియలో పెండింగ్ అంశాల గురించి చర్చించారు. ఇరిగేషన్, రైల్వే తదితర శాఖలకు సంబంధించిన భూముల విషయంలో పూర్తి సమాచారంతో కూడిన వివరణాత్మక ప్రతిపాదనలు సమర్పించవలసిందిగా సూచించారు. ఆర్డీవోలు, తహసిల్దార్లు ఇతర శాఖల సమన్వయంతో క్షేత్రస్థాయిలో సంయుక్త తనిఖీలు నిర్వహించి ఎటువంటి పెండింగ్ లేకుండా పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. ఆర్ అండ్ ఆర్ సర్వే త్వరగా పూర్తి చేయాలన్నారు. లంక భూములకు సంబంధించి ఏకీకృత నివేదికలు తయారు చేయాలన్నారు.గ్రామ కంఠాలు, ముటేషన్స్ విషయంలో ఆర్డీవోలు ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేయాలన్నారు.ఈ సమావేశంలో డి ఆర్ ఓ షేక్ ఖాజావలి,ఆర్డీవో శ్రీనివాసరావు, సి ఆర్ డి ఏ అధికారులు, డిప్యూటీ కలెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు కెరీర్ కౌన్సిలింగ్ ప్రాక్టికల్ గా ఇద్దాం



**గుంటూరు, జూన్ 4 : (మనం న్యూస్ ప్రతినిధి)** ప్రభుత్వ వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థులకు కెరీర్ కౌన్సిలింగ్ ఇద్దామని జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ అన్నారు.ఎస్.సి, ఎస్.టి, బి.సి, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులతో గురువారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. కెరీర్ కౌన్సిలింగ్ ఆయా కంపెనీలు, వ్యక్తులు, సంస్థల వద్దకు పంపించి ప్రాక్టికల్ గా ఇవ్వాలని తద్వారా విద్యార్థులకు చక్కగా అవగాహన వస్తుందని చెప్పారు. 120 మంది బాలురు, బాలికల చొప్పున బ్యాచ్ లు ఏర్పాటు చేసి జె.ఇ.ఇ, నీట్ పరీక్షల శిక్షణ కార్యక్రమం నిర్వహిద్దామని చెప్పారు. సూపర్ 60 ప్రోగ్రామ్ క్రింద శ్రీకాకుళం జిల్లా సీతంపేట ఐ.టి.డి.ఎ ప్రాజెక్టు అధికారిగా ప్రారంభించి విజయం సాధించమన్నారు. విద్యార్థులు ఐ.ఐ.టి, ఎన్.ఐ.టి విద్యా సంస్థలలో చేరడం జరిగిందని చెప్పారు. జిల్లా నుండి ప్రతీ ఏటా వసతి గృహ విద్యార్థులు జె.ఇ.ఇ,నీట్ పరీక్షలలో విజేతలుగా నిలవాలని ఆకాక్షించారు. విద్యార్థులలో అశావాహ దృక్పథం ఉంటుందని, వారి కలలను వాస్తవ రూపంలోకి తీసుకువచ్చుటకు కృషి చేద్దామన్నారు. ఇప్పటి నుండే సరైన శిక్షణ, సలహాలు ఇవ్వడం ద్వారా ఉన్నత స్థానాలు అందుకోగలరని,వారిలో తెలివితేటలు తక్కువ కాదని అన్నారు. సరైన సమయంలో సరైన మార్గదరకత్వంతో జీవితం మారుతుందని చెప్పారు. మైక్రో సాఫ్ట్,ఇతర కంపెనీ లకు, నేవీ, ఇతర పెద్ద కంపెనీలకు తీసుకువెళ్ళి చూపించడం వలన ఆలోచనా విధానం మారుతుందని పేర్కొన్నారు. జిల్లా విద్యా శాఖ అధికారి సమన్వయ అధికారిగా వ్యవహరించి కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వ భవనాలలో నడుస్తున్న 32 వసతి గృహాలు ఆహ్లాదకరంగా ఉండాలని సూచించారు. అన్ని వసతులు ఉండాలని,విద్యార్థులు మంచి వాతావరణంలో ఉండటం వలన చదువుపై ఏకాగ్రత పెరుగుతుందని చెప్పారు. ఆరు నెలలలో నవీకరణ పనులు పూర్తి కావాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి యు. చెన్నయ్య, జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి కె.మయూరి, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి డి. దుర్గా భాయి, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి పార్థసారథి, జిల్లా విద్యా శాఖ అధికారి డా.షేక్ సలీం భాషా తదితరులు పాల్గొన్నారు.

# యూపీఎస్సీలో 50వ ర్యాంక్... జయ అశ్వంత్‌రెడ్డికి సీపీ అభినందనలు



విజయవాడ సెంట్రల్, జూన్ 4 ( మనం న్యూస్): యూపీఎస్సీ నిర్వహించిన ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ఐఎఫ్ఎస్) పరీక్షలో 50వ ర్యాంకు సాధించి ఉద్యోగానికి ఎంపికైన బండి జయ అశ్వంత్రెడ్డిని నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖరబాబు అభినందించారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్లో ఏసీపీగా విధులు నిర్వహిస్తున్న బండి ఉమామహేశ్వరరెడ్డి కుమారుడైన జయ అశ్వంత్రెడ్డి ఇటీవల వెల్లడైన యూపీఎస్సీ ఫలితాల్లో ఈ ఘనత సాధించారు.ఈ సందర్భంగా గురువారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జయ అశ్వంత్రెడ్డి తన తల్లిదండ్రులతో కలిసి సీపీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన సాధించిన విజయంపై వివరాలు తెలుసుకున్న కమిషనర్ దుశ్శాలువాతో సత్కరించి ప్రత్యేకంగా అభినందించారు. అలాగే జయ అశ్వంత్రెడ్డి తల్లిదండ్రులు ఏసీపీ బండి ఉమామహేశ్వరరెడ్డి, వందన దంపతులను కూడా అభినందించారు.జయ అశ్వంత్రెడ్డి ఇంటర్మీడియట్ను కర్నూలులో, బీటెక్ (సివిల్ ఇంజినీరింగ్)ను హైదరాబాద్లో పూర్తి చేసి సివిల్స్కు సన్నద్ధమయ్యారు. అనంతరం యూపీఎస్సీ పరీక్ష రాసి ఆల్ ఇండియా 50వ ర్యాంకు సాధించి ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్కు ఎంపికయ్యారు. అడ్మిన్ డీసీపీ కె.జి.వి. సరిత కూడా జయ అశ్వంత్రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో డీసీపీ సరిత, ఏసీపీ ఉమామహేశ్వరరెడ్డి, వందన పాల్గొన్నారు.

# వైసీపీ నేత వేల్పుల రవికుమార్ ను పరామర్శించిన మాజీ ఎంపీ



పెనుగంచిప్రోలు జూన్ 4 మనం న్యూస్: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వేల్పుల రవికుమార్ ను బాపట్లమాజీ పార్లమెంటు సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత నందిగామ సురేష్ పరామర్శించారు. ఇటీవల వేల్పుల రవికుమార్ తండ్రి విశ్రాంత ఉపాధ్యాయులు వేల్పుల దాసు మృతి చెందిన విషయం తెలిసి గురువారం పెనుగంచిప్రోలు వచ్చిన నందిగామ సురేష్, వేల్పుల రవికుమార్ నివాసానికి విచ్చేశారు. దివంగత వేల్పుల దాసు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. వారి కుమారులు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి వేల్పుల రవికుమార్ ను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది కన్నెగంటి జీవ రత్నం , సూర్యా దినపత్రిక ఎడిటర్ ప్రముఖ జర్నలిస్ట్ కన్నెగంటి సజ్జన్ రావు , వేల్పుల రమేష్ , బోడా ప్రేమ్ , బెజవాడ శ్రీనివాసరావు , కుక్కల శ్రీధర్ , కొలకపోగు వెంకటేశ్వరరావు, ఏలూరు శ్రీను , ఓర్సు ఏడు కొండల , దోస పాటి ప్రసాద్ , కీసర చందు , కోట పరిశుద్ధ రావు , బత్తుల వెంకట నర్సి , వేల్పుల రాము , వేల్పుల అజయ్ , గుర్రాల పండు , తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# దుష్ప్రచారాలతో అభివృద్ధిని అడ్డుకోలేరు

- ఎంపీ కేశినేని చిన్ని

విజయవాడ తూర్పు జూన్ 4 (మనం న్యూస్): సామాజిక మాధ్యమాల్లో తనపై, తన అనుచరులపై జరుగుతున్న దుష్ప్రచారాలను ప్రజలు నమ్మరని, అభివృద్ధి కార్యక్రమాలను ఎవరూ అడ్డుకోలేరని విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని అన్నారు. మాజీ ఎంపీ కేశినేని నాని సోషల్ మీడియాలో చేస్తున్న వ్యాఖ్యలు, పోస్టుల నేపథ్యంలో గురువారం ఆయన స్పందించారు.ప్రజాస్వామ్యంలో విమర్శలు సహజమేనని, అయితే ఆధారాలు లేని ఆరోపణలు, వ్యక్తిగత దూషణలు, అసత్య ప్రచారాలు రాజకీయ సంస్క ృతికి మంచివి కావని పేర్కొన్నారు. ఒక అబద్ధాన్ని పదేపదే ప్రచారం చేయడం ద్వారా నిజమని నమ్మించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ప్రజలు నిజానిజాలను గుర్తించే పరిణతి కలిగి ఉన్నారని తెలిపారు.తనపై వస్తున్న విమర్శలకు మాటలతో కాకుండా పనితీరుతో సమాధానం ఇవ్వడానికే ప్రాధాన్యం ఇస్తానని చిన్ని స్పష్టం చేశారు. వివాదాల కంటే ప్రజాసేవ, అభివృద్ధి కార్యక్రమాల అమలుకే తాను అంకితమై ఉన్నానన్నారు. విజయవాడ పార్లమెంట్ పరిధిలో మౌలిక వసతుల అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి అవకాశాల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారంపై నిరంతరం దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. సోషల్ మీడియాలో జరిగే ప్రతికూల ప్రచారాల వల్ల అభివృద్ధి ఆగిపోదని, ప్రజాసేవకు ఎలాంటి ఆటంకం కలగదని పేర్కొన్నారు. రాజకీయ ప్రత్యర్థులు ఎన్ని విమర్శలు చేసినా ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ విజయవాడను అన్ని రంగాల్లో ముందంజలో నిలిపేందుకు కృషి కొనసాగిస్తానన్నారు. ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల, అభివృద్ధి కార్యక్రమాల అమలే తన ప్రధాన లక్ష్యమని, తన పనితీరే అన్ని ప్రశ్నలకు సమాధానం చెబుతుందని ఎంపీ కేశినేని చిన్ని అన్నారు.

# రంగా విగ్రహానికి స్థల పరిశీలన

- డిసెంబర్ 26 నాటికి ఆవిష్కరణ లక్ష్యం
- ఎమ్మెల్యే బొండా ఉమా

విజయవాడ సెంట్రల్ జూన్ 4 (మనం న్యూస్) అమరజీవి వంగవీటి మోహనరంగా విగ్రహ ఏర్పాటు కోసం ప్రతిపాదించిన స్థలాన్ని ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు గురువారం పరిశీలించారు. విజయవాడ పోలీస్ కంట్రోల్ రూమ్ ఎదురుగా ఉన్న స్క్రాప్ పార్క్ ప్రాంతంలో విగ్రహం ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో అక్కడి పరిస్థితులను ఆయన పరిశీలించి అధికారులతో, రంగా అభిమానులతో చర్చించారు. ఈ సందర్భంగా బొండా మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవం కోసం జీవితాంతం పోరాడిన మహానేత వంగవీటి మోహనరంగా అని కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేసిన ఆయన జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. రంగా కేవలం రాజకీయ నాయకుడు మాత్రమే కాకుండా అణగారిన వర్గాల ఆశాజ్యోతి అని పేర్కొన్నారు.విజయవాడ నగర ప్రజలకు, ముఖ్యంగా తూర్పు నియోజకవర్గానికి రంగా తో ప్రత్యేక అనుబంధం ఉందని తెలిపారు. ఆయన పోరాట స్ఫూర్తి భావితరాలకు తెలియజేయాలనే ఉద్దేశంతో ప్రజలకు సులభంగా చేరుకునే ప్రాంతంలో విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ మేరకు విజయవాడ మున్సిపల్ కౌన్సిల్లో తీర్మానం ఆమోదం పొందడం సంతోషకరమన్నారు.త్వరలో భూమిపూజ నిర్వహించి విగ్రహ నిర్మాణ పనులు ప్రారంభిస్తామని, డిసెంబర్ 26న జరిగే రంగా వర్ధంతి నాటికి విగ్రహాన్ని పూర్తి చేసి ప్రజలకు అంకితం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు వెల్లడించారు. రంగా ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి అభిమాని బాధ్యత అని పేర్కొన్నారు.స్థల పరిశీలనలో మా మిత్ర మండలి నాయకులు చింతల రామారావు (బాబి), చింతల రవికుమార్ (చంటి), నవనీతం సాంబశివరావు, అడపాల కృష్ణాజీ, దర్శి వాసు, గుజ్జుల అమర్, లంక వెంగళరావు యాదవ్, బాడిద శంకర్, బుల్ల విజయ్కుమార్ తదితరులు పాల్గొన్నారు. విగ్రహ ప్రాంతంలో ప్రజలకు అందుబాటు, ట్రాఫిక్ సౌకర్యాలు, భవిష్యత్ అభివృద్ధి అవకాశాలపై సమగ్రంగా పరిశీలించారు.



# ఉత్సాహంగా 'వెన్నుపోటుకు రెండేళ్లు' నిరసన

- డాక్టర్ మొండితోక జగన్మోహనరావు

నందిగామ,జూన్4(మనం న్యూస్): ఆంధ్రప్రదేశ్ ప్రజలకు చంద్రబాబు కూటమి ప్రభుత్వం వెన్నుపోటు పొడిచి రెండేళ్ళు పూర్తయిన సందర్భంగా నందిగామ మాజీ శాసన సభ్యులు డాక్టర్ మొండితోక జగన్మోహనరావు ఆధ్వర్యంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు 'వెన్నుపోటుకు రెండేళ్లు' నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో పార్టీ నాయకులు లతో కలసి నియోజకవర్గ ఇంచార్జి డాక్టర్ మొండితోక జగన్మోహనరావు ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల బాండ్లు, మేనిఫెస్టో ప్రతులను దహనం చేసి నిరసన తెలియజేసారు. ఈ సందర్భంగా జగన్మోహనరావు గారు మాట్లాడుతూ అధికారంలోకి రాగానే జగన్మోహన్ రెడ్డి చేసిన దానికన్నా ఎక్కువ ఇస్తామని చెప్పి బాండ్లు, ప్రమాణం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారంలోకి రాగానే చేసిన ప్రమాణాన్ని తుంగలో తొక్కుతూ




పవిత్రమైన తిరుపతి లడ్డూను సైతం అవహేళన చేశారని ఆయన పేర్కొన్నారు. చంద్రబాబు, వారి ప్రజాప్రతినిధుల కు ప్రమాణాలు దేవునిపై కనీసం గౌరవం లేదని జగన్మోహన్ రావు తెలిపారు.ఎన్నికల సమయంలో ఇంటింటికి తిరుగుతూ మహిళలు, రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులుగా ఉన్నవారెంత.. ఏడాదికి ఎంత వస్తుందని లెక్కలతో హామీలు గుప్పించి అధికారంలోకి రాగానే పూర్తిగా విస్మరించాలని మండిపడ్డారు. అమలకు సాధ్యం కానీ హామీలతో అధికారంలోకి వచ్చి అన్ని వర్గాల ప్రజలను నిలువునా మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్మోహన్ రెడ్డి అంత చేస్తే, అనుభవశాలి విజినరీ చంద్రబాబు ఇంతకుమించి చేస్తారని నమ్మకంతో ఓట్లు వేసిన మహిళల పరిస్థితి నేడ ఆగమ్య గోచరం గా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు అన్ని రకాలుగా అండగా ఉండాల్సిన ప్రభుత్వమే పిపిపి వెంట పరుగులు పెడుతుందని ఆయన దుయ్యా బట్టారు.రెండేళ్ల లో డ్వాక్రా సంఘాలు నిర్వీర్యం అవ్వగా, ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయ ని గుర్తు చేశారు. వైద్యం పూర్తిగా పడకేసిందని చెప్పారు, సిఎంఆర్ఎఫ్ సైతం సొంత పార్టీ నేతలకు అందిస్తున్నారు తప్ప సామాన్యులకు అందని పరిస్థితి నెలకొంది అని చెప్పారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలపై పెడుతున్న అక్రమ కేసులు, అవస్థలను చూసి ప్రజలు భయాందోళనతో కాలం వెళ్లదీస్తున్నారని చెప్పారు. ప్రజలను అన్ని రకాలుగా మోసం చేసి ఏదో సాధించినట్లు అటాహసంగా మహానాడు జరుపుకున్నారని ఆయన ఆరోపించారు. రెండేళ్లలో చంద్రబాబు ప్రభుత్వం చేసిన ఘనకార్యాలను ప్రజలు గమనిస్తున్నారని తప్పక బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలతో ఓట్లు దండుకొని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీలు అమలు చేసి తీరాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో నందిగామ పట్టణ, మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా, రైతు, విద్యార్థి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# వెన్నుపోటుకు రెండేళ్లు.. కూటమిపై వైసీపీ నిరసన



▸▸ మేనిఫెస్టో కాపీలు దగ్ధం చేసిన నేతలు

▸▸ ప్రజలను మోసం చేసిన ప్రభుత్వం: వెలంపల్లి శ్రీనివాసరావు

**విజయవాడ పశ్చిమ, జూన్ 4 (మనం న్యూస్)** ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వానికి నిరసనగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని క్లస్టర్-1 పరిధిలో గురువారం 'వెన్నుపోటుకు రెండేళ్లు' కార్యక్రమాన్ని నిర్వహించారు. పెజ్జోనిపేట పప్పుల మిల్లు సెంటర్లో క్లస్టర్ ఇన్చార్జి వాసా ఆదినారాయణ బాబు, డివిజన్ అధ్యక్షుడు మదిరి స్వామి వివేకానంద ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో మాజీ మంత్రి, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త వెలంపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కూటమి ఎన్నికల మేనిఫెస్టో ప్రతులను పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం వాటిని అమలు చేయకుండా ప్రజల విశ్వాసాన్ని ద్రోహం చేసిందని విమర్శించారు. వైఎస్ జగన్మోహన్రెడ్డి ప్రభుత్వాన్ని మించి సంక్షేమ పథకాలు అమలు చేస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల ఆశలను వమ్ము చేశారని ఆరోపించారు.మహిళలకు 'ఆడబిడ్డ నిధి' పేరుతో ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదని, ఉచిత గ్యాస్ సిలిండర్ల హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని చెప్పి పరిమిత వర్గాలకే వర్తింపజేసి మోసం చేశారని విమర్శించారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు లేదా నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి విస్మరించారని పేర్కొన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందిన 50 ఏళ్లు దాటిన వారికి పెన్షన్లు ఇస్తామని చెప్పి ఆ హామీని కూడా పక్కన పెట్టేశారని అన్నారు. రాష్ట్రంలో అప్పులు పెరుగుతున్నా ప్రజలకు అందుతున్న సంక్షేమం కనిపించడం లేదని విమర్శించారు. ''చంద్రబాబు అంటేనే మోసం.. మోసం అంటేనే చంద్రబాబు'' అన్న స్థాయికి పాలన దిగజారిందని ఆరోపించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూడా ఆయన విమర్శలు గుప్పించారు. రాష్ట్ర సమస్యల పరిష్కారంపై దృష్టి సారించకుండా ఇతర అంశాలపై ఎక్కువగా స్పందిస్తున్నారని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు అయ్యే వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన 'వెన్నుపోటుకు రెండేళ్లు' కార్యక్రమాలను ఈ నెల 12వ తేదీ వరకు విజయవంతంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎండి రుహుల్లా, వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అసిఫ్, మాజీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, మాజీ కార్పొరేటర్లు బండి పుణ్యశీల, శిరంశెట్టి పూర్ణచంద్రరావు, యలకల చలపతిరావు, యరడ్ల ఆంజనేయరెడ్డి, పడిగపాటి చైతన్యరెడ్డి, డివిజన్ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వాణీ స్కూల్ ప్రాంతంలో రెవెన్యూ సమస్యల పరిశీలన స్థలాల రిజిస్ట్రేషన్కు త్వరలో పరిష్కారం: గద్దె రామమోహన్



**విజయవాడ తూర్పు జూన్ 4 (మనం న్యూస్)** తూర్పు నియోజకవర్గంలోని మాచవరం డౌన్ వాణీ స్కూల్ ప్రాంతంలో నెలకొన్న రెవెన్యూ సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించి స్థలాల రిజిస్ట్రేషన్లు యజమానుల పేర్లపై జరిగేలా చర్యలు తీసుకుంటామని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ తెలిపారు. గురువారం రెవెన్యూ, కార్పొరేషన్ అధికారులతో కలిసి ఆయన ఆ ప్రాంతంలో పర్యటించి స్థానికుల సమస్యలను తెలుసుకున్నారు. స్థల యజమానుల వద్ద ఉన్న భూ రికార్డులను పరిశీలించిన ఎమ్మెల్యే, గత ఐదేళ్లుగా రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో పలువురు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు గుర్తించామని చెప్పారు. భూముల విషయంలో యజమానులకు ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని పేర్కొన్నారు.ఈ ప్రాంతానికి సంబంధించిన కొన్ని పాత భూ రికార్డులు అందుబాటులో లేకపోవడంతో శుక్రవారం మరోసారి పర్యటించి వాటిని పరిశీలిస్తామని తెలిపారు. రికార్డుల ఆధారంగా అధికారులతో సమగ్రంగా పరిశీలించి, అర్హులైన యజమానులకు పూర్తి హక్కులతో రిజిస్ట్రేషన్లు జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అవసరమైతే ఈ అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, క్యాబినెట్ స్థాయిలో చర్చించి అందరికీ న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. సమస్య పరిష్కారానికి సంబంధించిన ప్రతిపాదనలను కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి పంపించి త్వరితగతిన నిర్ణయం తీసుకునేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రోహిణీదేవి, సర్వే విభాగం ఏడీ మోహన్రావు, పార్టీ నాయకులు దాసరి గాబ్రియేల్, సొగసాని రత్నశ్రీ, కృష్ణప్రసాద్, దొమకొండ రవికుమార్, షేక్ షకీలా బేగం తదితరులు పాల్గొన్నారు.

# కూటమి హామీలన్నీ గాలిలో కలిశాయి

▸▸ ప్రజలకు వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు ప్రభుత్వం

▸▸ 8న టౌన్హాల్, 12న భారీ ర్యాలీ

▸▸ దేవినేని అవినాష్




**విజయవాడ తూర్పు జూన్ 4 (మనం న్యూస్)**: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వానికి నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన 'వెన్నుపోటుకు రెండేళ్లు' కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని వైఎస్సార్సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ పేర్కొన్నారు. గురువారం విజయవాడలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయినా ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. నిరసనలో భాగంగా టీడీపీ మేనిఫెస్టో ప్రతులను దగ్ధం చేస్తున్నామని తెలిపారు. మహిళలకు 50 ఏళ్లకే పెన్షన్, నిరుద్యోగ యువతకు భృతి, ఆడబిడ్డ నిధి వంటి హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం వాటిని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు.మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి హయాంలో ఆసరా, చేయూత, ఇంటి స్థలాలు వంటి సంక్షేమ పథకాల ద్వారా పేదలకు అండగా నిలిచారని చెప్పారు. ఫీజు రీయింబర్స్మెంట్తో పాటు విద్యార్థుల సంక్షేమానికి పెద్దపీట వేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం విద్యార్థులకు కనీస సౌకర్యాలు కూడా కల్పించలేని పరిస్థితి నెలకొందని విమర్శించారు.జగన్ ప్రభుత్వం రిటైనింగ్ వాల్ నిర్మాణాలు చేపట్టి, పేదలకు ఇళ్ల పట్టాలు అందించిందని పేర్కొన్నారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా ప్రభుత్వాన్ని నమ్మి అడిగే పరిస్థితి అప్పట్లో ఉండేదన్నారు. ప్రస్తుతం చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, లోకేష్ మినహా ప్రజల్లో ఎవరూ సంతోషంగా లేరని వ్యాఖ్యానించారు. వాలంటీర్, గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థలను తీసుకొచ్చి పరిపాలనను ప్రజలకు చేరువ చేసిన ఘనత జగన్కే దక్కుతుందని చెప్పారు. మరోవైపు కూటమి ప్రభుత్వం విద్యుత్, పెట్రోల్, నిత్యావసర వస్తువుల ధరలను పెంచి ప్రజలపై అదనపు భారం మోపిందని ఆరోపించారు. ప్రజల సొమ్ముతో మంత్రులు విదేశీ పర్యటనలు చేస్తూ కాలక్షేపం చేస్తున్నారని విమర్శించారు.ప్రజా సమస్యలపై మరింత విస్తృతంగా చర్చించేందుకు ఈ నెల 8న టౌన్హాల్ సమావేశం నిర్వహిస్తున్నామని, 12న జిల్లాలో భారీ ర్యాలీ చేపడతామని దేవినేని అవినాష్ తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

# ఇంధన ధరల పెంపుపై 9న.రాస్తారోకో

▸▸ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలి

▸▸ వామపక్షాల పిలుపు

**విజయవాడ సెంట్రల్ జూన్ 4 (మనం న్యూస్)**: పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెరుగుదలకు నిరసనగా ఈ నెల 9న రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న రాస్తారోకోలను విజయవంతం చేయాలని వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. విజయవాడలో గురువారం సీపీఐ కార్యాలయం (దాసరి భవన్)లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వామపక్ష నాయకులు ఈ మేరకు ప్రకటించారు.సీపీఐ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాల కారణంగా ఇంధన ధరలు సామాన్య ప్రజలకు భారంగా మారాయని విమర్శించారు. అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు తగ్గుతున్నప్పటికీ దేశంలో మాత్రం పన్నుల పేరుతో పెట్రోల్, డీజిల్ భారీగా వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. ఇంధన ధరల పెరుగుదల వల్ల నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరిగి ప్రజలపై అదనపు భారం పడుతోందన్నారు.సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనెపూడి కాశీనాథ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలు అవలంబిస్తూ సామాన్యుల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తోందన్నారు. సబ్సిడీల కోతలు, ధరల పెంపులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ పరిస్థితులకు వ్యతిరేకంగా నిర్వహించే రాస్తారోకో కార్యక్రమంలో ప్రజలు, కార్మికులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నగర కార్యదర్శి పి. పద్మ, సీపీఐ నగర సహాయ కార్యదర్శి లంక దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



# శుక్రవారం రద్దీకి ఇంద్రకీలాద్రి సిద్ధం



▸▸ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలి

▸▸ అధికారులకు ఈవో శీనా నాయక్ ఆదేశాలు

విజయవాడ ఇంద్రకీలాద్రి జూన్ 4 (మనం న్యూస్)ః ఇంద్రకీలాద్రిపై శుక్రవారం భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆలయ కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ గురువారం సాయంత్రం ఆలయ పరిసరాలను పరిశీలించారు. కొండపైన, కొండకింద భక్తులకు అందుతున్న తాగునీటి సదుపాయాలు, మరుగుదొడ్లు, వేచి ఉండే ప్రదేశాలు, క్యూ లైన్ల ఏర్పాట్లను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. వేసవి సెలవులు ముగింపు దశకు చేరుకోవడంతో శుక్రవారం భక్తుల రద్దీ పెరిగే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది ఉదయం 7 గంటల నుంచే అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. క్లోక్రూములు, చెప్పుల స్టాండ్లు, మొబైల్ డిపాజిట్ కౌంటర్లు సమయానికి ప్రారంభించి తగిన సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు.క్యూ లైన్లలో చల్లని తాగునీరు నిరంతరం అందుబాటులో ఉండేలా చూడడంతో పాటు, అన్ని మరుగుదొడ్లను పరిశుభ్రంగా నిర్వహించాలని తెలిపారు. ఉచిత ప్రసాదాలు, అన్నప్రసాద వితరణలో అంతరాయం లేకుండా ప్రతి భక్తునికి ప్రసాదం అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. భక్తుల రద్దీని సమర్థంగా నిర్వహించేందుకు క్రౌడ్ మేనేజ్మెంట్, రవాణా వ్యవస్థలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, కొండపైన, కొండకింద బస్సులు నిరంతరం నడిచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే భద్రతా సిబ్బంది మొబైల్ ఫోన్ల తనిఖీలను కట్టుదిట్టం చేసి అనుమతి లేని మొబైల్ ఫోన్లు ఆలయంలోకి ప్రవేశించకుండా చూడాలని సూచించారు. అన్ని విభాగాల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా శుక్రవారం సేవలను విజయవంతంగా నిర్వహించాలని ఈవో శీనా నాయక్ ఆదేశించారు.

# అవినాష్ వ్యాఖ్యలు రాజకీయ దివాళాకోరుతనమే



▸▸ టీడీపీ నేతలు

▸▸ చంద్రబాబును విమర్శించే

**అర్హత, స్థాయి లేవని విమర్శ**

విజయవాడ, తూర్పు జూన్ 4 (మనం న్యూస్ )ః వైఎస్సార్సీపీ నాయకుడు దేవినేని అవినాష్ చేస్తున్న వ్యాఖ్యలు రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమని, బురద రాజకీయాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు మానుకోవాలని ఎన్టీఆర్ జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు కొట్టేటి హనుమంత రావు, జిల్లా కార్యదర్శి పిల్లా శ్రీనివాసరావు విమర్శించారు. గురువారం విజయవాడలో విడుదల చేసిన ప్రకటనలో వారు ఈ వ్యాఖ్యలు చేశారు.రాష్ట్ర అభివృద్ధికి నాలుగు దశాబ్దాలకుపైగా కృషి చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని విమర్శించే ముందు దేవినేని అవినాష్ తన రాజకీయ చరిత్రను పరిశీలించుకోవాలని సూచించారు. రాజకీయ అవసరాల కోసం పార్టీలు మారుతూ, పదవుల కోసం సిద్ధాంతాలను తాకట్టు పెట్టిన వ్యక్తికి చంద్రబాబు గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. ప్రజా సమస్యలపై మాట్లాడే సామర్థ్యం లేక, రాజకీయ ప్రాధాన్యం కోల్పోవడంతో వార్తల్లో నిలిచేందుకు చంద్రబాబు పేరును ఉపయోగించుకోవడం అవినాష్కు అలవాటుగా మారిందని ఆరోపించారు. చంద్రబాబు స్థాయిని అందుకోవడం సంగతి పక్కన పెడితే, ఆయనను విమర్శించే కనీస రాజకీయ పరిణతి కూడా అవినాష్కు లేదని పేర్కొన్నారు.అసత్యాలు, వ్యక్తిగత విమర్శలు, బురద రాజకీయాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే రోజులు ముగిశాయని, ప్రజలు వాస్తవాలను గుర్తించే స్థాయికి చేరుకున్నారని తెలిపారు. ఇకనైనా దేవినేని అవినాష్ బాధ్యతాయుతంగా వ్యవహరించి రాజకీయ పరిణతి ప్రదర్శించాలని, లేకపోతే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

# అనధికారికంగా ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు

**ఆర్డీవో కుమార్**

విస్సన్నపేట,జూన్4(మనం న్యూస్).ః విస్సన్నపేటలో పలు ఎరువుల షాపులను ఆర్డీవో కుమార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా యూరియా ఐఎఫ్ఎంఎస్ స్టాక్ రిజిస్టర్, గ్రౌండ్ స్టాక్స్ను అధికారులు పరిశీలించారు. ఎరువులను అనధికారికంగా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో డీలర్లను హెచ్చరించారు. ఈ తనిఖీల్లో తహశీల్దార్ లక్ష్మీ కళ్యాణి, మండల వ్యవసాయాధికారి రాజ్యలక్ష్మి, ఎస్ఐ అర్జున్, రెవెన్యూ డీటీ విజయభాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



# ఎంటిఎంసి డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ కి 6 వ వార్డ్ లోని డ్రైనేజీ సమస్యలను వివరిస్తున్న అంబటి తిరుపతిరావు

**తాడేపల్లి, జూన్ 4, మనం న్యూస్ః** మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని తాడేపల్లి 6 వ వార్డ్ సలాం సెంటర్లో డ్రైనేజీ సమస్యలను జనసేన పార్టీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు అంబటి తిరుపతిరావు ఎంటిఎంసి డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ ను స్వయంగా తీసుకువెళ్లి 6 వ వార్డ్ లో డ్రైనేజీ సమస్యలను వివరించారు.ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యలను వివరించారు. డ్రైనేజీ సమస్యను త్వరగా పరిష్కరించాలని అధికారులను కోరారు.ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ సమస్యలను వీలైనంత త్వరగా డ్రైనేజీ సమస్యలు పరిష్కరించి ప్రజలకు ఉపశమనం కల్పిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు చల్లా వెంకటేశ్వర్లు, దుర్గా బాబు, శివ, వేముల వెంకట్, మల్లెల దుర్గ బాబు, దినేష్ చక్రవర్తి, వెంకట్రావు, నంద్యాల శ్రీనివాస్ రావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

